సాక్షి
తిరుపతి
మంగళవారం । 16 । జూలై । 2024



దాబా ధ్వంసం
చంద్రగిరి మండలం, రామిరెడ్డిపల్లి పంచాయతీ పీలేరు– తిరుపతి జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాను కూల్చివేశారు. - 8లో



మృతదేహాల అప్పగింత
ఏర్పేడు మండలం పరమాలపల్లె వద్ద మృతిచెందిన తల్లీబిడ్డ మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించారు. - 8లో



అదుపుతప్పిన బైక్
రామచంద్రాపురం మండలం, ఎన్ఆర్ కమ్మపల్లి వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. - 8లో

- చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు గురుకుల పాఠశాలలో 458 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ఇక అంతే. పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్ కేడర్‌లో ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

- తిరుపతి జిల్లాలోని నాయుడుపేట గురుకుల పాఠశాలలో 520 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల ప్రాంగణంలోకి వెళితే ముక్కు మూసుకోవాల్సిందే. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడబడినా మలమూత్ర విసర్జనే కనిపిస్తోంది. పాఠశాల మొత్తం దుర్గంధ భరితంగా మారింది. పాఠశాలలో ఒక స్టాఫ్ నర్స్ విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఆరోగ్య చికిత్సలు చేయడం లేదు.



నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

.. ఇది ఒక్క పూతలపట్టు, నాయుడుపేట గురుకులాల పరిస్థితే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి గురుకులంలోనూ ఇదే దుస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి తారుమారైంది. పాఠశాలలు తెరిచి నెలరోజులైనా పైసా విదల్చకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా తయారైంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అటువైపు కనెత్తి చూడకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది.

గురుకులం.. కల్లోలం





నీరసిస్తూ..నిరీక్షిస్తూ



గురుకులంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది



విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

సమస్యలతో సతమతమవుతున్న గురుకుల పాఠశాలలు
- అధ్వానంగా పారిశుద్ధ్యం నిర్వహణ
- కలుషిత ఆహారం, తాగునీరే విద్యార్థులకు గతి
- చెబితే ఏమవుతుందోనని భయపడుతున్న పిల్లలు
- పట్టించుకోని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్/ సూళ్లూరుపేట/ తిరుపతి తుడా: గురుకుల పాఠశాలల సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వెరసి విద్యార్థులకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. విద్యాబుద్ధులు అటుంచితే కనీస సౌకర్యాలు కల్పించడంలో చతికిల పడుతున్నారు. పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం విషయాన్ని గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు తరచూ వ్యాధులబారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రులపాలవుతున్నారు. కూటమి నేతలతోపాటు సంబంధిత అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పారిశుద్ధ్యం పట్ల అలసత్వం

ఒక్కో గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులకు పైగా చదువుతుంటారు. చాలా పాఠశాలల్లో బ్లీచింగ్, ఫినాయిల్, పొరకలు లాంటివి కూడా చాలినన్ని లేక సిబ్బంది అల్లాడాల్సి వస్తోంది. ఇక గత ప్రభుత్వంలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు చాలా పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. అలాగే నాడు–నేడు ద్వారా పాఠశాలలు, బాత్‌రూమ్‌ల రూపురేఖలు మారాయి. కానీ నెల రోజులుగా వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక వంట గదుల నిర్వహణ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. దోమల నివారణకు నెలకోసారి కూడా ఫాగింగ్ లాంటి చర్యలు చేపట్టడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
చిత్తూరు	07	3,367
తిరుపతి	10	6,436

జాడలేని వైద్యులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను వారానికి ఒకసారి వైద్యులు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి గురుకుల పాఠశాలలో వైద్యచికిత్సలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను అమలు చేయాలి. ఆ నిబంధనలను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

అరకొరగా దుప్పట్లు

గురుకుల పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఒక దుప్పటి, కార్పెట్ ఇవ్వాలి. అయితే రెండు జిల్లాల్లోని 17 పాఠశాలల్లో 25 శాతం మాత్రమే దుప్పట్లు, కార్పెట్లను సరఫరా చేశారు. రాత్రుల్లో దోమల బాధ, చలికి తట్టుకోలేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే నేలపై పరిచి నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థిని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీహరి

ఏడుగురికి తీవ్ర అస్వస్థత
నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా 139 విద్యార్థులు అస్వస్థతకు గురికాగా అందులో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గురుకుల పాఠశాలలో 520 మంది విద్యార్థులుండగా 139 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో నీరసపడిపోయారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనతో గురుకుల పాఠశాలకు పరుగులు తీశారు. 108 అంబులెన్స్ ద్వారా నాయుడుపేట, సూళ్లూరుపేట కమ్యూనిటీ ఆస్పత్రులకు విద్యార్థులను తరలించారు. గూడూరు ప్రాంతీయ ఆస్పత్రికి మరికొంతమందిని తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఏడుగురిని నెల్లూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల పరామర్శ

విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయులు, ఎంపీ మద్దిల గురుమూర్తి, కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. గురుకులంలో పడకేసిన పారిశుద్ధ్యంపై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా ఇలా జరిగిందని, వార్డెన్ స్థానికంగా నివాసం ఉండడం లేదని తెలిపారు.

విచారణ చేస్తున్నాం
“ నాయుడుపేట ఘటనపై సమగ్రంగా విచారణ నిర్వహిస్తున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతాం. ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యనివ్వాలని ప్రిన్సిపల్స్‌ను ఆదేశించాం.

– పద్మజ, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా

కలచివేసింది



ఆస్పత్రిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని 139 మందికి పైగా అస్వస్థతకు గురికావడం ఎంతో కలచివేసిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని గురుకులాన్ని ఆయన సోమవారం సాయంత్రం సందర్శించి అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీహరి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి పద్మజ, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. గురుకులంలో పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థులకు సత్వరం మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. అనంతరం ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల తదితర వాటికి సంబంధించి కూడా ఎంపీ నిధులు కేటాయిస్తామని చెప్పారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గురుకులాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఎంపీతోపాటు నాయకులు పోట్లపూడి రాజేష్, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధాకరం



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీహరితోపాటు సూపరింటెండెంట్ చంద్రకళతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంతోపాటు విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చారనానరు. కోట్లాది రూపాయలతో ప్రభుత్వ వైద్యశాలల స్థితిగతులను మార్చారన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేందుకు దోహదపడిందన్నారు. కొంతమంది వైద్యశాలలో పడకలు లేవని మాట్లాడడం అర్థరహితమన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలను అత్యాధునిక హంగులతో నిర్మించినట్టు వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జున్‌రెడ్డి, కటకం జయరామయ్య, ధారా రవి, చదలవాడ కుమార్, సునిల్, తన్నమాల రమణయ్య, ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్



చిల్లకూరు : సిబ్బందితో తల్లిదండ్రుల వాగ్వాదం

15 రోజుల్లో 40 మందికి అస్వస్థత
ఒక విద్యార్థిని మృతి..



చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిల్లకూరు: గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలోని గురుకులాల్లో గత 15 రోజుల్లోనే ఒక విద్యార్థిని మృతి చెందగా 140 మంది విద్యార్థులు కలుషిత ఆహారం, నీరు తాగి అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో తాగునీరు కలుషితమై 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల పాటు ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందారు. రెండు రోజుల క్రితం దక్కిలి మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదివే ఓ విద్యార్థిని తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. ఆపై చెన్నై ఎగ్మూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి తయారు చేసిన అల్పాహారాన్ని ఆదివారం ఉదయం విద్యార్థులకు వడ్డించారు. దీంతో 120 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

నాయుడుపేట గురుకులంలో పరిస్థితి ఇదీ



హాస్టల్‌లోపల అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

గురుకుల పాఠశాలలో వార్డెన్‌తో పాటు ఆరుగురు వంట నిర్వాహకులు ఉన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్‌తోపాటు ఆరుగురు స్వీపర్లు పనిచేస్తున్నారు. గురుకులంలో 850 మంది విద్యార్థులకు గాను 96 మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానాల గదులు ప్రత్యేకంగా ఉన్నాయి. కానీ ఇవన్నీ మలవిసర్జనతో దుర్గంధభరితంగా మారాయి. పాఠశాలలో వంట గది పరిస్థితి మరింత దారుణంగా ఉంది. విద్యార్థులు భోజనం చేసే గది అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది.

విజృంభిస్తున్న విషజ్వరాలు
తిరుపతి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, రేణిగుంట, పుత్తూరు, తిరుపతి రూరల్ మండలాల్లో విషజ్వరాలు తాండవిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు సైతం పంజా విసురుతున్నాయి. వారం రోజుల క్రితం తిరుపతి రూరల్ మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే మానసిక వికలాంగుల వసతి గృహంలో కలుషిత తాగునీరు సేవించడంతో 19 మంది ఆస్పత్రి పాలయ్యారు. విరోచనాలు, వాంతుల భారినపడి అందులో ఇద్దరు మానసిక వికాలంగులు మృత్యువాత పడ్డారు. అలాగే ఇటీవల డక్కిలి మండలంలో డయేరియాతో ఒకరు మృత్తి చెందారు. డక్కిలి, నాయుడుపేట గురుకుల పాఠశాలలు, అనాథ ఆశ్రమం, స్లమ్ ఏరియాల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 230 మందికిపైగా అనారోగ్యం భారిన పడ్డారు. వారిలో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యంగా తిరుపతి పట్టణంలో డెంగీ జ్వరాలు తీవ్రరూపం దాల్చాయి. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.
మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.
సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.
సాక్షి ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు
SAKSHI
99122 20586, 9951602971
Mail id: tptadvtsakshi@gmail.com

తిరుపతి ప్రతిష్టను పెంపొందిస్తా

- శ్రీవారి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భద్రత
- నూతన ఎస్పీ సుబ్బరాయుడు





తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బరాయుడు, కలెక్టర్‌తో తిరుపతి జిల్లా ఎస్పీ

తిరుపతి క్రైమ్: శాంతి భద్రతల పరిరక్షణను పటిష్టంగా అమలు చేసి, తిరుపతి ప్రతిష్టను మరింత పెంపొందిస్తామి తిరుపతి జిల్లా నూతన ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీస్‌శాఖ తరఫున ఆయనకు గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఏఎస్పీలు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మంచి పోలీసింగ్‌ను అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ప్రతిఒక్కరూ చట్టానికి లోబడే పోలీస్ శాఖలో పనిచేయాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో పనిచేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ఎస్పీ శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, విమలకుమారి, డీఎస్పీలు సీఐలు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

తిరుపతి అర్బన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి జిల్లా భద్రత విషయాలపై చర్చించారు.

అపోలో ఎక్స్‌పర్ట్స్‌తో కన్సల్టేషన్
Apollo HOSPITALS
యూరాలజీ క్లినిక్
డా॥ సందీప్ బఫ్నా
MS, DNB యూరాలజీ, MRCS (Edinburgh)
కన్సల్టెంట్ యూరాలజిస్ట్ & జెనిటోయూరినరి రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్
కన్సల్టేషన్ – స్ట్రిక్చర్ యురేత్రా, పెరోనీస్ వ్యాధి, యురేత్రోప్లాస్టి, పెల్విక్ ఫ్రాక్చర్, యురేత్రా గాయం, జనరల్ యూరాలజీ, అడల్ట్ హైపోస్పాడియాస్ మరియు పెనైల్ కర్వేచర్ కోసం
తేది: శనివారం, 20.07.2024
సమయం: ఉ.10.00 గం. నుండి మ.2.00 గం.
ప్రదేశం: అపోలో క్లినిక్
19-9-29/2A, తిరుచానూర్ రోడ్డు, లక్ష్మీపురం సర్కిల్, తిరుపతి
అపాయింట్‌మెంట్స్ కోసం:
98665 66757 / 94911 39025



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.75,500
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,766

వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.94,500
రిటైల్ వెండి గ్రాము రూ.96.50

క్లుప్తంగా

రేపు ప్రజాప్రతినిధుల సన్మాన సభ



మాట్లాడుతున్న కురుబ, కురుమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ కురుబ, కరుమ, కురువ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న ఉదయం 10 గంటలకు పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే కురుబ సామాజికవర్గ ప్రజాప్రతినిధుల సన్మాన సభను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సన్మాన సభకు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు సుమారు 20 మంది హాజరువుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి గోవిందరాజ స్వామికి జ్యేష్టాభిషేకం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 18వ తేదీ వరకు జ్యేష్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తుల కవచాలను ఏడాదికొకసారి తొలగించి శుద్ధి చేసి తిరిగి అమర్చుతారు. ఇందులో భాగంగా మంగళవారం కవచాధివాసం, 17న కవచ ప్రతిష్ఠ, 18న కవచ సమర్పణ చేపడతారు. ఈ ఉత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం మహాశాంతి హోమం, పుణ్యాహ వచనం చేస్తారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శత కలశ స్నపనం, సాయంత్రం వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఆషాడ మాసం, జ్యేష్టా నక్షత్రం రోజున ఆలయంలో జ్యేష్టాభిషేకం చేయడం ఆనవాయితీ.

వైఎస్సార్‌సీపీ నేత దాబా ధ్వంసం

- మా బతుకులు రోడ్డున పడ్డాయి
- బోరున విలపించిన బాధితుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'ఇంత దారుణమా.. ఇంత అరాచకమా.. గడిచిన ఐదేళ్ల కాలంలో నేను ఎవరికి ఏ హానీ తలపెట్టలేదు. అందరికీ మేలు చేశాను. ఇంతకంటే దారుణం మరొకటి ఏముంది. నా తండ్రికి కేన్సర్, నాకు ఇద్దరు ఆడపిల్లలు ఈ రోజు నా కుటుంబం మొత్తాన్ని రోడ్డున పడేశారు. ఇంతకంటే మా కుటుంబం మొత్తం నిలబడుకుంటాం మమల్ని చంపేయండి' అంటూ వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడసాని ప్రవీణ్ నాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రగిరి మండలం, రామిరెడ్డిపల్లి పంచాయతీ పీలేరు–తిరుపతి జాతీయ రహదారి ఆనుకుని ఉన్న మేడసాని ప్రవీణ్‌కు చెందిన దాబా హౌస్‌ను ఆదివారం అర్ధరాత్రి జేసీబీల సాయంతో గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేశారు. బాధితుడి వివరాల మేరకు.. చంద్రగిరి మండలం ఏజీపల్లికి చెందిన మేడసాని ప్రవీణ్ నాయుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు. ఆయన తన వ్యక్తిగత పనులపై ఆదివారం విజయవాడకు వెళ్లారు. ఆదివారం రాత్రి తన భార్య దాబాను మూసుకుని వెళ్లారు. ఆమె వెళ్లిన వెంటనే సుమారు 25 మంది ముసుగులు ధరించి దాబా వద్దకు చేరుకున్నారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, వారంతా దాబా హౌస్‌ను నేలమట్టం చేస్తుండడంతో అక్కడ పనిచేస్తున్న ఉత్తరాది వంట మనుషులు ప్రవీణ్‌తో పాటు ఆమె భార్యకు ఫోన్‌లో సమాచారం అందించారు. ప్రవీణ్ భార్య తిరిగి దాబా వద్దకు వచ్చే దాబా మొత్తం



ప్రవీణ్ దాబాను ధ్వంసం చేసిన దృశ్యం

నేలమట్టమైంది. సోమవారం విజయవాడ నుంచి వచ్చిన ప్రవీణ్ దాబాను పరిశీలించి కన్నీటి పర్యంతమయ్యారు. తన శత్రువులు ఎవరో దాబాను ధ్వంసం చేశారంటూ వాపోయానే. దాబా హౌస్‌లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌ను సైతం అపహరించినట్లు బాధితుడు మీడియాకు వివరించాడు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి హుటాహుటిన దాబా వద్దకు చేరుకున్నాడు. బాధితులను పరామర్శించారు.



బోరున విలపిస్తూ తన సన్నిహితులతో మాట్లాడుతున్న బాధితుడు మేడసాని ప్రవీణ్

మొరాయించిన సర్వర్లు

- శ్రీవారిమెట్టు కాలినడకన మార్గంలో ఆందోళనకు దిగిన భక్తులు

చంద్రగిరి: తిరుమల కాలినడకన శ్రీవారిమెట్టు మార్గం గుండా నడుచుకుంటూ వెళ్లేందుకు వచ్చిన శ్రీవారి భక్తులు ఆందోళనకు దిగారు. సకాలంలో దర్శనం టిక్కెట్లను అందించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు శ్రీవారి కాలినడక భక్తులకు టీటీడీ టోకన్లను జారీచేస్తుంది. అయితే వర్షం కారణంగా టైంస్లాట్ టోకన్ల జారీప్రక్రియలో సర్వర్లలో సాంకేతిక లోపం కారణంగా ఆలస్యమైంది. ఉదయం సుమారు మూడు గంటల పాటు వృద్ధులు, మహిళలు, పిల్లలు వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో భక్తులు ఆగ్రహానికి లోనై ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న టీటీడీ ఉన్నతాధికారులు సర్వర్లలో



వర్షంలోనే టైం స్లాట్ టోకన్ల కోసం వేచి ఉన్న శ్రీవారి భక్తులు

లోపాన్ని సరిచేసి ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా టోకన్ల జారీ ప్రక్రియను ప్రారంభించారు. అధికారులు ఆలస్యంగా స్పందించడంతో శ్రీవారి భక్తులు మండిపడ్డారు.

'మీకోసం'కు 70 ఫిర్యాదులు



ఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీని సంప్రదించి 72 ఫిర్యాదులు అందజేశారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు ఆప్షనల్ హాలిడే

తిరుపతి ఎడ్యుకేషన్ : మొహర్రం పర్వదినం సందర్భంగా మంగళవారం మొదటి ఆప్షనల్ హాలిడే (ఐచ్ఛిక సెలవు) వినియోగానికి అనుమతిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, మండల విద్యాశాఖాధికారులు ఆప్షనల్ హాలిడే తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సంస్కృత వర్సిటీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గర్వకారణం

- బోధన, బోధనేతర సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యం
- త్వరలో సంస్కృత యాప్ రూపకల్పన
- వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించడం గర్వంగా ఉందని వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన సోమవారం వర్సిటీ పరిపాలనా భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది నిర్విరామ కృషి, విద్యార్థుల సహకారంతో ఈ ఘనత సాధించామన్నారు. నాక్ బృందం వర్సిటీలో పర్యటించి మౌలిక సదుపాయాలు, భవనాలు, ల్యాబ్‌లు, సిబ్బంది తదితరాలను పరిశీలించినట్టు పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉండడంతోనే ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందని వివరించారు. వర్సిటీలో ప్రతినిత్యమూ సంస్కృత భాషాభివృద్ధికి కోసం ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌ఈపీ–2020ని అమలు చేసిన తొలి జాతీయ సంస్కృత వర్సిటీ మనదేనన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 500



మీడియా సమావేశంలో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్‌తో వీసీ, రిజిస్ట్రార్, అధికారులు

మంది పరిశోధకులకు పీహెచ్‌డీలు ప్రదానం చేసినట్టు తెలిపారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులు దక్కించుకున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే టీటీడీ, పాండిచ్చేరి వంటి సంస్థలతో కొన్ని అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నామని, త్వరలో యూజీసీ ప్రాజెక్టులు దక్కించుకునేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో సంస్కృతం యాప్‌ను రూపొందించాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, వేదిక్ కృషి విజ్ఞాన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మంచి రేటింగ్ పెంచుకుని మరింత పురోగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ రజనీకాంత శుక్లా, పీఆర్‌ఓ ప్రొఫెసర్ రమేష్‌బాబు, ఏపీఆర్‌ఓ కుమార్ పాల్గొన్నారు.

17న సైన్సు సెంటర్‌లో కొత్త ప్లానిటోరియం ప్రదర్శన

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 17న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ నూతనంగా ప్లానిటోరియం ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ సోమవారం తెలిపారు. అలాగే చంద్రుడిపై మానవుడు కాలుమోపిన సందర్భంగా వారం రోజుల పాటు స్పేస్ వీక్ – 2024 జరుపుతున్నామని.. ఈ వారం రోజులూ విద్యార్థులతో పాటు సందర్శకులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు కొత్త ప్లానిటోరియం ప్రారంభం అనంతరం 'అంతరిక్షం – ఖగోళ శాస్త్రం'పై ఓపెన్ హౌస్ సైన్సు క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. 18న 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు 'అంతరిక్షం – ఖగోళ శాస్త్రం'పై కోల్లెజ్ మేకింగ్ పోటీలు, 19న మోటారుతో నడిచే గ్లైడర్‌పై వర్క్ షాప్ జరుగుతుందన్నారు. ఇందులో ఆసక్తి గల 7 నుంచి పదో తరగతి విద్యార్థులు రూ.200 చెల్లించి వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. 20వ తేదీన పిల్లల కోసం చంద్రుడిని అర్థం చేసుకోవడంపై వర్క్‌షాప్ ఉంటుందని.. నాలుగు నుంచి ఆరో తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని.. రిజిస్ట్రేషన్ రుసుం లేదని.. కత్తెర తీసుకురావాలన్నారు. 21న 'చంద్రుని వలస రాజ్యం' అనే అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీ



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ

లు ఉంటాయన్నారు. ఇందులో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. రాకెట్, శాటిలైట్ మోడల్ పోటీలు జరుగుతాయని.. ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 22వ తేదీన 'అంతరిక్షం – ఖగోళ శాస్త్రం' అంశంపై ఇంటర్ స్కూల్ టీమ్‌వైజ్ క్విజ్ పోటీలు ఉంటాయని.. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని.. ఒకే పాఠశాల నుంచి ఒక బృందంలో ఇద్దరు ఉండాలని తెలిపారు. 23న చంద్రునిపై ల్యాండింగ్, అభివృద్ధి చెందుతున్న ఉత్సుకత, సవాళ్లు, అవకాశాలపై పాపులర్ సైన్స్ లెక్చర్ ఉంటుందన్నారు. చివరగా బహుమతుల ప్రదానం ఉంటుందని.. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకాలంలో అర్జీలను పరిష్కరించండి



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్: గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రీవెన్స్‌కు తప్పకుండా జిల్లా అధికారులు హాజరుకావాల్సిందేనని స్పష్టం చేశారు. స్పందన ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇదిలావుండగా సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి మొత్తం 131 అర్జీలు వచ్చాయని, అందులో అత్యధికంగా 94 అర్జీలు రెవెన్యూ విభాగానికి చెందినవని తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్, ఏఓ జయరాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

స్పందన చోటే గ్రీవెన్స్

కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన చోటే గ్రీవెన్స్‌ను సోమవారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ప్రతి సోమవారం కలెక్టరేట్ తొలి అంతస్తులోని ఖాళీ స్థలంలో రెండేళ్లకు పైగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వచ్చారు. విశాలమైన ఖాళీ స్థలంతో పాటు అర్జీలను నమోదు చేయించుకోవడానికి వీలుగా ఆరు కౌంటర్లు ఉండేవి. ఇప్పుడు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఉండాలంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ప్రాంతంలో కాకుండా సమీపంలోని జెడ్పీ కార్యాలయం కోసం కేటాయించిన చాంబర్‌ను గ్రీవెన్స్‌కు ఎంపిక చేశారు. నాలుగు వారాలు ఆ చాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. అయితే విపరీతమైన రీసాండ్ వస్తుండడంతో కలెక్టర్‌తోపాటు, జేసీ, ఇతర అధికారులు ఇస్తున్న ఆదేశాలు స్పష్టంగా అర్థమయ్యేవికావు. అంతేకాకుండా ప్రజలు తమ సమస్యలు తెలియజేసేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితులను గుర్తించిన జిల్లా అధికారులు తిరిగి గత ప్రభుత్వం స్పందన చేపడుతున్న ప్రాంతంలోనే గ్రీవెన్స్‌ను సోమవారం చేపట్టారు.

పుత్తూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు అస్వస్థత

నాయుడుపేట గురుకుల పాఠశాలలో కలుషిత హారం తిని 121 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వారిని పరామర్శించేందుకు గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ నాయుడుపేటకు వెళ్లడంతో పుత్తూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ గ్రీవెన్స్ సెల్‌కు హాజరయ్యారు. అయితే కొంత సమయానికే ఆమె అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా స్పందనలో ఉన్న వైద్య సిబ్బంది కలెక్టరేట్‌లోనే ఆమెకు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం ఆమె బంధువులకు సమాచారం అందించి కారులో తరలించారు.



అస్వస్థతకు గురైన పుత్తూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

అవధానంతో విద్యార్థుల్లో మేధోశక్తి

తిరుపతి సిటీ: అవధాన ప్రక్రియతో విద్యార్థుల్లో మేధోశక్తి, సృజనాత్మకత పెంపొందుతాయని సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీలో సోమవారం రెండు రోజుల అవధాన సంగమం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవధాన ప్రక్రియలో మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి విద్యార్థికీ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన విద్యానికేతన్ సంస్థ డైరెక్టర్ విజయకృష్ణ రాజగోపాల్, డాక్టర్ ధూళిపాల మహాదేవమణి, ప్రొఫెసర్ సంపదానంద మిశ్ర, డీన్ రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ రమాశ్రీ పాల్గొన్నారు.

మృతదేహాల అప్పగింత



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పేడు: మండలంలోని పరమాలపల్లి రోడ్డు పక్కన కూర్చొని ఉన్న బాపన శారద, ఆమె కుమార్తె గురువైష్ణవిని ఆదివారం రాత్రి కంటైనర్ లారీ ఢీకొట్టడంతో మృతిచెందారు. ఆ ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి పరమాలపల్లి వద్ద బండపై కూర్చొని ఉన్న వారిపై వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వెళుతున్న కంటైనర్ లారీ వారిపైకి దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో శ్రీకాళహస్తి మండలంలోని రామానుజపల్లికి చెందిన బాపన శారద, కుమార్తె గురువైష్ణవి మృతిచెందారని చెప్పారు. ఆదివారం రాత్రి మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించి జేటీసీ బసిరెడ్డి

పరమాలపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాద స్థలాన్ని రీజినల్ జేటీసీ బసిరెడ్డి, శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదరనాయుడుతో కలిసి పరిశీలించారు. రోడ్లు, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీ చేపట్టారు. అధికారులు మాట్లాడుతూ కంటైనర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో శారద(22), కుమార్తె గురువైష్ణవి(2) మృతిచెందినట్లు వెల్లడించారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి నియమాలు పాటించకపోవడం, సెల్ ఫోన్‌లో మాట్లాడడం, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివేదికను మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి పంపనున్నట్లు తెలిపారు.

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

– వ్యక్తి మృతి

రామచంద్రాపురం: ద్విచక్రవాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రాయలచెరువు కట్ట– నెత్తకుప్పం ప్రధాన రహదారి ఎన్‌ఆర్ కమ్మపల్లి భారతం మిట్ట ఆర్చి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు.. నెత్తకుప్పం దళితవాడకు చెందిన గోపీ (36) కుప్పంబాదూరుకు తన ద్విచక్రవాహనంపై వస్తుండగా తిమ్మరాజుపల్లి నుంచి ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో గోపీకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వైద్యసేవల నిమిత్తం ఓ ప్రైవేటు వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



గోపీ (ఫైల్)

ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేద్దాం



తిరుపతి జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం : శేషాచల అడవుల్లో ఉన్న అరుదైన ఎర్రచందనాన్ని రక్షించుకునేందుకు అందరమూ కృషి చేద్దామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన ఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్‌గా సుబ్బరాయుడు అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎర్రచందనం పరిరక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. టాస్క్‌ఫోర్స్‌లోని సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ఎర్రస్మగ్లర్లు అడవుల్లోకి వెళ్లకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకాలు చేశారు. తదుపరి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

ప్రాణం బలిగొన్న 'లారీ' హారన్!

నారాయణవనం: సోమవారం మధ్యాహ్నం మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నాగలాపురం మండలం, నందనంకు చెందిన భానుప్రియ(24) మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం.. భానుప్రియ తన భర్తతో కలిసి స్కూటర్‌పై పుత్తూరుకు వచ్చింది. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో మండలంలోని పాలమంగళం సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ హారన్ మోగించడంతో స్కూటర్ వెనుక కుర్చున్న భానుప్రియ ఉలిక్కిపడి అదుపు తప్పి కింద పడిపోయింది. అదే సమయంలో వెనుక వస్తున్న టిప్పర్ లారీ భానుప్రియను ఢీకొనడంతో మృతి చెందింది. ఈ ప్రమాదంలో భానుప్రియ తల పూర్తిగా ఛిద్రమైంది. పోలీసులు కేసును నమోదు చెసి, మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన భానుప్రియ

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: తమ కళాశాల కంప్యూటర్ విభాగంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వై.రాజశేఖర్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీ, ఎంసీఏ, ఎంటెక్ 55 శాతం మార్కులతో పాసైన వారు, నీట్, సెలెక్ట్, పీహెచ్‌డీ, అధ్యాపక అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 19లోపు దరఖాస్తు చేయాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్




COACHING

■ TET-ENGLISH Coaching by S.V.Chalapathy free Demo on 14.07.2024, Time: 09.30 to 11 A.M at Madam Sarojana Kinder Garden School, 1st Cross, Srinagar Colony, Near Satyanarayana puram, Tirupati, ✆ 9652380850.

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry 9381287629

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry 9381287629



PLOTS FOR SALE

■ 5 లక్షల 9999లకే హైవేకి ఆనుకొని తిరుపతి IISER ప్రక్కన ఫైనల్ అప్రూవ్ కల్గిన ప్లాట్లు అయోధ్య టౌన్ షిప్‌నందు కలవు. డైరెక్ట్ ఓనర్. 9502774175, 7995992114.

■ Plots Available for Sale Tuda Approved Chandragiri - Tirupati Highway West, East Face Plots Available Near Shloka Birla School Contact Details: 7760448201



■ తిరుపతి నందు కొత్తగా ప్రారంభిస్తున్న NGO కొరకు Managers, Computer Operator, Incharges కావలెను. జీ:10-25 వేలు వరకు మహిళా అభ్యర్థులు మాత్రమే. 8186060777.

■ ప్రముఖ Govt(R) Co కి మండలాల వారిగా పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్, మేనేజర్స్ కావలెను. అ: 10 – డిగ్రీ జీ: 28,000–35,000 ట్రైనింగ్ ఇవ్వబడును. ✆ 8008830057

■ చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలంలో ప్రముఖ లాడ్జి నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్, స్కావెంజర్స్ చిత్తూరులో జ్యువలరీ షాప్‌లో సేల్స్ గర్ల్స్‌గా పనిచేయుటకు ఎసీ సేల్స్ అనుభవం కలిగిన యువతులు కావలెను. సం.ప్ర: 9515130414, 9160152122.

■ తిరుపతి Airport దగ్గర Dixon టెక్నాలజీ ప్రై.లి. నందు పనిచేయుటకు TV ప్రొడక్షన్‌లో Line ఆపరేటర్స్ (M/F) కావలెను. Age: 18 to 30K, 10th, Inter, ITI పాస్/ఫెయిల్, డ్యూటీ 8 గం॥, జీతం: 14000+ఇన్‌సెంటివ్స్ చేస్తే డబుల్ పేమెంట్. భోజనం+బస్సు సౌకర్యం ఫ్రీ. సంప్ర: 6305103552, 9581882886

■ సూళ్లూరుపేట ప్రముఖ పరిశ్రమకు ఎంప్లాయ్, సూపర్‌వైజర్, ప్యాకింగ్‌కు ఆడవారు, క్యాంటీన్‌లో కుక్ & హెల్పర్స్ కావలెను. ✆ 81427 61777, 92960 11777

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15–28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ కస్టమ్లేస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000–40000, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995583999

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరిన మీదట, ప్రకటనదారులు తెలిపే రీతిగా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.